# సంక్షేమం, అభివృద్ధే సీఎం ధ్యేయం

**కంచరపాలెం:** ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని నెడ్‌క్యాప్‌ చైర్మన్‌, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 48వ వార్డులో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ ఆయన వెళ్లి ఇప్పటి వరకు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొండవాలు ప్రాంతాల్లో పర్యటించి సమస్యలు పరిశీలించారు. మౌలిక వసతులు అధ్వానంగా ఉన్నాయంటూ ప్రజలు వినతిపత్రాలు అందించారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ గతంలో రాజకీయ నాయకులు స్వార్థ పూరితంగా ప్రజలను మోసం చేసేవారన్నారు. సీఎం వైఎస్‌ జగన్‌ సంపూర్ణ మనసుతో ప్రజలకు మంచి చేయాలనే దృఢ సంకల్పంతో నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. రాష్ట్ర కార్పొరేషన్‌ చైర్‌పర్సన్‌, డైరెక్టర్లు పిల్లి సుజాత నూకరాజు, రవికుమార్‌, వైఎస్సార్‌సీపీ 48వ వార్డు ఇన్‌చార్జి నీలి రవి, సీనియర్‌ నాయకుడు కర్రి రామారెడ్డి, పి.పద్మా, నరేష్‌, శ్రీరామ్‌, నాగేంద్ర, కనక, డొప్ప శ్రీను, మహేష్‌, నాయుడు, అప్పారావు, రామ్‌నాయుడు, పార్వతి, అబ్బదం, ఉమామహేష్‌, నవీన్‌, బాబ్జీ, గురువోజీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న కె.కె.రాజు



కొండవాలులో సమస్యలు పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త

## పబ్లిక్‌ డిమాండ్‌

### బాబోయ్‌.. దుర్వాసన!

**సీతమ్మధార:** జీవీఎంసీ 14వ వార్డు సీతమ్మధారలోని క్షత్రియ కల్యాణ మండపం రోడ్డు పక్కన చెత్త విపరీతంగా పేరుకుపోవడంతో దుర్వాసన వెలువడుతోంది. ఆ మార్గంలో ముక్కు మూసుకుని రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. అక్కడ ఉన్న డస్ట్‌ బిన్‌ వ్యర్థాలతో నిండిపోయింది. స్థానికులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చెత్త తొలగించాలి.

– డి.రంగనాథ్‌, సీతమ్మధార



క్షత్రియ కల్యాణ మండపం రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త

## క్లుప్తంగా

### అభయాంజనేయుడికి పూజలు



పూజలందుకున్న ఆంజనేయ స్వామి

**సీతమ్మధార:** సీతమ్మధార కొండవాలు ప్రాంతం బిలాల్‌ కాలనీలోని 108 అడుగుల అభయాంజనేయ స్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుభముహూర్త సెలబ్రేషన్స్‌లో భాగంగా భక్తులు పాల్గొన్నారు. అర్చక బృందం స్వామికి పూజలు చేశారు.

### శివాలయంలో అన్నసంతర్పణ



అన్నదానం చేస్తున్న ట్రస్టు ప్రతినిధులు

**సీతమ్మధార:** పౌర్ణమి సందర్భంగా నక్కవానిపాలెం ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృతాభిషేకం, భక్తుల గోత్ర నామాలతో పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ చేపట్టారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

# చైన్‌ స్నాచర్ల కోసం గాలింపు

**ముంబైకి వెళ్లిన క్రైం పోలీసులు**

**సీతమ్మధార:** నగరంలో గత మంగళవారం ఉదయం కలకలం రేపిన చైన్‌ స్నాచర్ల కోసం క్రైం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ముంబై, చెన్నైల్లో నిందితులు ఉన్నట్లు సమాచారం మేరకు నగరం నుంచి క్రైం సీఐ దుర్గాప్రసాద్‌ సారథ్యంలో ఇద్దరు ఎస్‌ఐలు, కానిస్టేబుళ్లు రెండు బృందాలుగా గురువారం ఉదయం అక్కడికి వెళ్లినట్లు సమాచారం. దొంగతనం జరిగిన ముందు రోజు త్రీటౌన్‌ పరిధిలోని ఒక చిన్న హోటల్‌లో దిగిన దుండగులు, మంగళవారం ఉదయం 5.30 గంటల సమయంలో ఏపీ39 ఎల్‌వీ 3174, టీవీఎస్‌ అపాచీ బైక్‌ను దొంగిలించారు. దానిపై నగరంలో తిరుగుతూ 6.30 గంటల సమయంలో అక్కయ్యపాలెం 80 ఫీట్‌ రోడ్డులో వాకింగ్‌ చేస్తున్న మహిళ మెడలో మూడున్నర తులాల బంగారు పుస్తెల తాడును తెంపుకుని జ్ఞానాపురం వైపు వెళ్లిపోయారు. అక్కడ ఒక మహిళ మెడలో బంగారు గొలుసు తెంపుకుపోయే ప్రయత్నం విఫలమవడంతో సౌత్‌జైల్‌ రోడ్డు వైపు వెళ్లిపోయారు. టూటౌన్‌ పరిధి భీమ్‌నగర్‌ వద్ద ఒక మహిళ మెడలో ఒకటిన్నర తులం బంగారు చైన్‌ తెంపుకుని పరారయ్యారు. ఈ ఘటనలపై నగర పోలీస్‌ కమిషనర్‌ సీహెచ్‌ శ్రీకాంత్‌ ఆదేశాల మేరకు నగర క్రైం డీసీపీ గంధం నాగన్న సూచనలతో దర్యాప్తు చేపట్టారు. దుండగులు బస చేసిన హోటల్‌లో నిందితులు ఇచ్చిన ఆధార్‌ కార్డు నకిలీదిగా గుర్తించారు. వారిచ్చిన ఫోన్‌ నంబర్‌ ద్వారా చైన్‌ స్నాచర్లు మహారాష్ట్ర, ముంబై నగరం తానేలో ఉన్నట్లుగా గుర్తించి పోలీసులు అక్కడకు చేరుకుని గాలింపు చర్యలు చేపడుతున్నట్లు తెలిసింది. చెన్నైలో కూడా గాలింపు చేపడుతున్నట్లు సమాచారం. మరి కొద్ది రోజుల్లో నిందితులను పట్టుకునే అవకాశం ఉంది.

## విద్యుత్‌ సరఫరాకు నేడు అంతరాయం

**మురళీనగర్:** మద్రిపాలెం సెక్షన్‌ 104 ఏరియా, గ్రీన్‌ గార్డెన్స్‌ 11 కేవీ ఫీడర్ల పరిధిలో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్‌–2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు 104 ఏరియా ఫీడర్‌ పరిధి ఐటీఐ కూడలి, సిద్ధార్థనగర్‌, 104 ఏరియా, బాపూజీ నగర్‌, భవాని గార్డెన్స్‌, శ్యాంనగర్‌ కాలనీ, గ్రీన్‌ గార్డెన్స్‌ ఫీడర్‌ పరిధి పార్వతీనగర్‌, హుస్సేన్‌నగర్‌, పంజాబ్‌ హోటల్‌ కూడలి, గ్రీన్‌ గార్డెన్స్‌, సాయినగర్‌ ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్‌ సరఫరా ఉండదన్నారు.

**రేపు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు**

**సీతంపేట:** అక్కయ్యపాలెం సెక్షన్‌ 11 కేవీ గ్రీన్‌పార్క్‌ ఫీడర్‌ నిర్వహణ పనుల్లో భాగంగా శనివారం విద్యుత్‌ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈఈ జి.సత్యనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నరసింహనగర్‌ రైతుబజార్‌, బి.ఎస్‌.లేఅవుట్‌, శాంతిపురం, ఎన్జీజీవోస్‌ కాలనీ, శంకరమఠం రోడ్‌, జీవీఎంసీ పంప్‌ హౌస్‌, జీవీఎంసీ స్కూల్స్‌, ఆరోగ్య కేంద్రం, కిన్నెర మెస్‌, పద్మశ్రీ ఆస్పత్రి, ఫోర్త్‌టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ రోడ్‌ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్‌ సరఫరా ఉండదని చెప్పారు.

# గుడ్‌ఫ్రైడే ప్రార్థనలకు రక్షణగిరి సిద్ధం

**కంచరపాలెం:** జ్ఞానాపురం రక్షణగిరిలో ఈ నెల 7వ తేదీ శుక్రవారం గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నట్లు సెయింట్‌ పీటర్స్‌ పునీత పేతురు దేవాలయం విచారణకర్త రెవరెండ్‌ ఫాదర్‌ డాక్టర్‌ జొన్నాడ జాన్‌ప్రకాష్‌ తెలిపారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా విశాఖ అర్చిబిషప్‌ (అతిమేత్రానులు) ఫాదర్‌ మల్లావరపు ప్రకాశ్‌ విచ్చేయనున్నట్లు తెలిపారు. రెవరెండ్‌ ఫాదర్ల నేతృత్వంలో శిలువను మోసుకుంటూ వేలాది మంది భక్తులతో కలిసి రక్షణగిరిపైకి శిలువ మార్గం నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రీస్తు మరణాన్ని సూచిస్తూ ఏర్పాటు చేసిన 14 విగ్రహాల వద్ద ప్రార్థిస్తూ ప్రదక్షిణలు చేయనున్నట్లు ఫాదర్‌ జాన్‌ప్రకాష్‌ తెలిపారు. ఉదయం 5.30 గంటలకు సెయింట్‌ పీటర్స్‌ చర్చి నుంచి రక్షణగిరి వరకు నిర్వహించే శిలువ మార్గ ప్రార్థనల్లో క్రైస్తవ భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.



ముస్తాబవుతున్న జ్ఞానాపురం రక్షణగిరి

# ప్రజల్లోకి విస్తృతంగా పథకాలు

**సీతంపేట:** ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని 43వ వార్డు కార్పొరేటర్‌ పెద్దిశెట్టి ఉషశ్రీ అన్నారు. నందగిరినగర్‌లోని ఆమె కార్యాలయంలో గురువారం సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు జగనన్న మా భవిష్యత్తు కార్యక్రమ కిట్లు అందజేశారు. ఆమె మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు సూచనల మేరకు శుక్రవారం నుంచి వార్డులోని చెక్కుడురాయి బిల్డింగ్‌ వద్ద జగనన్న మా భవిష్యత్‌, మా నమ్మకం నువ్వే జగన్‌ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. 43వ వార్డులో 17 మంది సచివాలయ కన్వీనర్లు, 190 మంది గృహసారథులు ఉన్నారని, ప్రతి ఒక్కరూ అంకితభావంతో ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయాలని కోరారు.



గృహసారథులు, కన్వీనర్లకు కిట్లు అందజేస్తున్న కార్పొరేటర్‌ ఉషశ్రీ

# కంచరపాలెం రైల్వే ట్రాక్‌ సమస్యపై డీఆర్‌ఎంకు వినతి

**తాటిచెట్లపాలెం:** కంచరపాలెం, రామ్మూర్తిపంతులుపేట వద్ద ఉన్న రైల్వే ట్రాక్‌ సమస్యపై సీబీఐ మాజీ జేడీ వి.వి.లక్ష్మీనారాయణ గురువారం డీఆర్‌ఎం అనూప్‌కుమార్‌ సత్పతిని కలిసి వినతిపత్రం సమర్పించారు. తరచూ ప్రజలు రైల్వే ట్రాక్‌ను దాటేటప్పుడు ప్రమాదాలకు గురవుతున్నారని, ఈ సమస్యపై సానుకూలంగా స్పందించి ప్రత్యామ్నాయం చూపించాలని డీఆర్‌ఎంను కోరారు. పి.శ్రీనివాస్‌, బుద్దాల కృష్ణమోహన్‌, సర్వసిద్ధి గౌరీశంకర్‌, జేడీ ఫౌండేషన్‌ సభ్యులు పాల్గొన్నారు.



# మతం మారితే రిజర్వేషన్‌ నిలిపేయాలి



మాట్లాడుతున్న సూర్యనారాయణ

**సీతంపేట:** మతం మారిన గిరిజనులకు రిజర్వేషన్లు వర్తింపచేయకుండా చట్టం తేవాలని జనజాతి సురక్ష మంచ్‌ జాతీయ కన్వీనర్‌ పి.సూర్యనారాయణ డిమాండ్‌ చేశారు. ద్వారకానగర్‌ పౌర గ్రంథాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మతం మారిన గిరిజనులకు రిజర్వేషన్లు నిలిపేయాలని ఈ నెల 9న అల్లూరి జిల్లా పాడేరులో పెద్ద ర్యాలీ, సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పాడేరు మండల కేంద్రం తలారిసింగ్‌ మెయిన్‌ రోడ్‌లోని గౌతమీ స్కూల్‌ ఆవరణ నుంచి ప్రభుత్వ జూనియర్‌ కళాశాల మైదానం వరకు మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల మధ్య మహా ర్యాలీ జరుగుతుందన్నారు. ఈ ర్యాలీ ద్వారా క్రైస్తవం, ఇస్లాం వంటి మతాలు స్వీకరించిన గిరిజనులను షెడ్యూల్‌ తెగల నుంచి మినహాయించాలని, దీనికి అవసరమైన సవరణలు చేయాలని కోరుతున్నామన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున గిరిజనులు ర్యాలీలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాకూరు కరుణాకర్‌, గిరిజన ఐక్య వేదిక ప్రధాన కార్యదర్శి కిముడు దేవి పాల్గొన్నారు.

# వైభవుడి దివ్యక్షేత్రంలో పౌర్ణమి వేడుకలు



అభిషేక ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

**మురళీనగర్:** కప్పరాడ ఎన్జీజీవోస్‌ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామి దివ్యక్షేత్రంలో చైత్ర మాసం పౌర్ణమి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 6.30 గంటలకు వైభవుడికి ఆర్జిత సుప్రభాత సేవ నిర్వహించారు. సేవా దాతలు, భక్తులు మంగళధ్వనితో వేద మంత్రోచ్ఛారణల మధ్య అభిషేక ప్రదక్షిణ చేశారు. శ్రీవారికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, పంచదార, ఫలరసాలు, పసుపు, కుంకుమ, చందనం వంటి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. ఉదయం 8.30 గంటలకు భక్తులకు స్వామి నిజపాద దర్శనం కల్పించారు. 10.30 గంటలకు శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించి అర్చన చేశారు. ఆర్జిత సేవలో పాల్గొన్న దాతలను శ్రీవారి శాలువా, కండువాతో ఆలయ అర్చకుడు వాసుదేవచార్యులు సత్కరించి వైభవుడి చిత్రపటాన్ని అందజేశారు. ఆలయ ఈవో బందారు ప్రసాద్‌ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# ‘జగనన్నే మా భవిష్యత్తు’పై గృహసారథులకు అవగాహన

**తాటిచెట్లపాలెం:** జీవీఎంసీ 42వ వార్డు పరిధిలోని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు గురువారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంపై అవగాహన కల్పించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆళ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాల గురించి ప్రతి ఇంటికి వెళ్లి వివరిస్తూ, స్థానిక సమస్యలు ఉంటే గుర్తించాలని తెలిపారు. వీరికి కార్యక్రమ కిట్లను ఆళ్ల శ్రీను అందజేశారు. సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు వెంకటేష్‌, శివ, జయమ్మ, కనకమహాలక్ష్మి, బి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.



కిట్లు అందిస్తున్న ఆళ్ల శ్రీనివాసరావు

# ఇంటింటికీ వెళ్లండి..

**మద్రిపాలెం:** వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు సూచనల మేరకు గురువారం 51వ వార్డు మాధవధార మాధవ స్వామి కల్యాణ మండపంలో 286, 289, 290 సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులతో కార్పొరేటర్‌ రెయ్యి వెంకటరమణ మా నమ్మకం నువ్వే జగన్‌ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు తెలియజేయాలని కోరారు. జేసీఎస్‌ మండల కన్వీనర్‌ పైడి కృష్ణరావు, 51వ వార్డు సచివాలయం కన్వీనర్‌ బి.తిరుమలరావు, ప్రసూనరెడ్డి, దిడ్డి రమేష్‌, లక్ష్మణరావు, రత్న, అప్పారావు, కరిమిరెడ్డి శ్యామ్‌, గణేష్‌ తదితరులు పాల్గొన్నారు.



కిట్లు ప్రదర్శిస్తున్న కార్పొరేటర్‌ రెయ్యి వెంకటరమణ, కన్వీనర్లు, గృహసారథులు

# అనధికార నిర్మాణాల కూల్చివేత



గొల్లవీధిలో అదనపు అంతస్తుకు రంధ్రం పెడుతున్న సిబ్బంది

**సీతంపేట:** జీవీఎంసీ జోన్‌–3 పరిధిలో అనధికార అంతస్తులపై టౌన్‌ ప్లానింగ్‌ అధికారులు కొరడా ఝుళిపించారు. 25, 27 వార్డులతోపాటు కృష్ణ కళాశాల రోడ్‌లో అనుమతి లేకుండా నిర్మించిన అదనపు అంతస్తులపై ఫిర్యాదులు వెల్లువెత్తడంతో టౌన్‌ ప్లానింగ్‌ ఏసీపీ వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు టీపీఎస్‌ తేజ పర్యవేక్షణలో సిబ్బంది కూల్చివేశారు. 25వ వార్డు సీతంపేట గొల్లవీధిలో కుమార్‌ క్యాటరింగ్‌ పక్కన జీ ప్లస్‌2కు అనుమతి తీసుకుని అనధికారంగా మూడో అంతస్తు నిర్మించారు. దీనిపై ఫిర్యాదులు రావడంతో గురువారం టౌన్‌ప్లానింగ్‌ సిబ్బంది అక్రమ నిర్మాణానికి పెద్ద రంధ్రాలు పెట్టారు. 27వ వార్డు శ్రీనగర్‌లోని జోన్‌–3 కార్యాలయానికి సమీపంలో అదనపు అంతస్తు నిర్మాణం కోసం వేసిన కాలమ్స్‌ను తొలగించారు. అనుమతి లేకుండా అదనపు నిర్మాణాలు చేపడితే ఉపేక్షించేది లేదని ఏసీపీ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. సచివాలయ ప్లానింగ్‌ సెక్రటరీలు పాల్గొన్నారు.

# సింగాలమ్మపురంలో ఫాగింగ్‌



ఫాగింగ్‌ చేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

**తాటిచెట్లపాలెం:** జీవీఎంసీ 45వ వార్డు సింగాలమ్మపురం కొండవాలు ప్రాంతంలో గురువారం జీవీఎంసీ సిబ్బంది ఫాగింగ్‌ చేశారు. దోమల వ్యాప్తిని అరికట్టేందుకు, వ్యాధులను నివారించేందుకు ఆయా కాలనీల్లో సిబ్బంది ఈ కార్యక్రమం చేపడుతున్నారు. సింగాలమ్మపురంలో కాలనీ అధ్యక్షుడు చింతల బాబూరావు దగ్గరుండి ప్రతి వీధిలో ఫాగింగ్‌ను చేయించి పర్యవేక్షించారు.

# ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలి

**సీతంపేట:** జగనన్న కాలనీల ఇళ్ల లబ్ధిదారులకు ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు ఇవ్వాలని, టిడ్కో లబ్ధిదారులకు వెంటనే ఇళ్లు అప్పగించాలని అఖిలపక్ష రాజకీయ పార్టీలు డిమాండ్‌ చేశాయి. సీపీఐ ఆధ్వర్యంలో గురువారం ద్వారకానగర్‌ పౌర గ్రంథాలయంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు అధ్యక్షతన జగనన్న ఇళ్లు, టిడ్కో ఇళ్లపై చర్చా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఇళ్ల కోసం కేటాయించిన సెంటు భూమి ఒక కుటుంబం నివసించేందుకు సరిపోదని, ప్రభుత్వం ఇస్తున్న రూ.1.80 లక్షలు, లబ్ధిదారుడి వాటా రూ.35 వేలతో ఇళ్లు నిర్మించుకోవడం జరిగేపని కాదన్నారు. టిడ్కో గృహాల నిర్మాణ పనులు 90 శాతం పూర్తయినా.. మిగతా 10 శాతం పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించాలని డిమాండ్‌ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ లబ్ధిదారులు నివసించే ప్రదేశానికి 40 కిలోమీటర్ల దూరంలో ఇళ్లు కేటాయిస్తున్నారని, దీనివల్ల వారంతా ఉపాధికి దూరమవుతున్నారన్నారు. లబ్ధిదారులు నివసించే ప్రాంతంలో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నజీర్‌, కాంగ్రెస్‌ పార్టీ నాయకుడు ఎస్‌.సుధాకర్‌, లోక్‌సత్తా నాయకుడు హరిగణేష్‌, ఆమ్‌ ఆద్మీ పార్టీ నాయకుడు ఎన్‌.భాస్కర్‌, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్‌.కె.రెహమాన్‌, కె.సత్యనారాయణ, పి.చంద్రశేఖర్‌, జి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



సంఘీభావం తెలుపుతున్న అఖిలపక్ష నాయకులు

# విశిష్ట సేవకులకు ‘వీ’ పురస్కారాల ప్రదానం

**సీతంపేట:** వీ డెంటల్‌ మల్టీ స్పెషాలిటీ సెంటర్‌ మొదటి వార్షికోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన వారికి గురువారం ద్వారకానగర్‌ పౌర గ్రంథాలయంలో వీ పురస్కార్‌–2023 పేరుతో ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథి సీబీఐ మాజీ జేడీ వి.వి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సమాజ సేవలో నిష్ణాతులైన వారిని సత్కరించి గౌరవిస్తున్న వీ డెంటల్‌ యాజమాన్యాన్ని అభినందించారు. మీడియా రంగానికి చెందిన ఈశ్వర్‌, వరలక్ష్మి, జగన్‌మోహన్‌, యాంకర్‌ వీరూ మామ, గైనకాలజిస్ట్‌ జి.నాగసుధాలక్ష్మి, న్యూ హోప్‌ ఫౌండేషన్‌ వ్యవస్థాపకురాలు ఎం.నాగమల్లీశ్వరి, గ్రేటర్‌ విశాఖ టైలర్స్‌ అసోసియేషన్‌ ఉపాధ్యక్షుడు కొల్లి సత్యనారాయణ, రోటరీ క్లబ్‌ ఆఫ్‌ గ్రేటర్‌ విశాఖ అధ్యక్షుడు గుమ్ములూరి కృష్ణమూర్తిలకు అతిథుల చేతుల మీదుగా వీ పురస్కారాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వీ డెంటల్‌ డైరెక్టర్‌ కె.ఎం.కె.రమేష్‌, వీజేఎఫ్‌ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి, ఏయూ సెక్యూరిటీ చీఫ్‌ ఖాన్‌ పాల్గొన్నారు.



గైనకాలజిస్ట్‌ నాగసుధాలక్ష్మిని పురస్కారంతో సత్కరిస్తున్న అతిథులు

# యువతి అదృశ్యం

**మద్రిపాలెం:** కంచరపాలెం ఐదో పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో ఓ యువతి అదృశ్యమైన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఐటీఐ జంక్షన్‌ వద్ద తుమ్మడిపాలెంలో తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్న లలితాదేవి అనే యువతి ఫిజియోథెరపిస్ట్‌గా పనిచేస్తోంది. ఈ నెల 4న ఓ రోగికి ఫిజియోథెరపీ చేయాలని ఇంటి నుంచి వెళ్లి తిరిగి చేరుకోకపోవడంతో తల్లిదండ్రులు పలు చోట్ల గాలించారు. ఎంత వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో గురువారం సాయంత్రం యువతి తండ్రి సత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఎవరికైనా కనిపిస్తే స్టేషన్‌లో సమాచారం అందించాలని పోలీసులు కోరారు.



లలితాదేవి

# హైవేపై కారును ఢీకొట్టిన లారీ

**మద్రిపాలెం:** కంచరపాలెం జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగింది. ఐదో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా.. గురువారం ఉదయం తాటిచెట్లపాలెం నుంచి ఎన్‌ఏడీ వైపు వెళ్తున్న కారును.. లారీ ఢీకొట్టింది. ఎన్‌ఏడీ వైపు తమ బంధువుల ఇంటికి వెళ్తున్న పోతల సత్యనారాయణ కారును అదే దారిలో వెనుక వస్తున్న లారీ అధిగమించే క్రమంలో కారు పక్క భాగాన్ని ఢీకొంది. దీంతో ఒక్కసారిగా కారు అదుపుతప్పి డివైడర్‌పైకి వెళ్లిపోయింది. ఎటువంటి ప్రాణహాని జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి కారులో ఎవరెవరున్నారు అనే వాటిపై పూర్తి వివరాలు తెలియరాలేదు. సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కంచరపాలెం సీఐ ఎస్‌.విజయ్‌కుమార్‌ నేతృత్వంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.



డివైడర్‌పైకి ఎక్కిన కారు

# బౌద్ధాలయంలో పూజలు

**కంచరపాలెం:** అశోక్‌నగర్‌ బౌద్ధాలయంలో ఆంధ్ర బౌద్ధ కేంద్ర సమాజం ప్రధాన కార్యదర్శి కె.రాజుగణేష్‌ ఆధ్వర్యంలో గురువారం పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. పేద మహిళలకు చీరలు అందజేసి, అన్నదానం చేశారు. ముందుగా బుద్ధుని విగ్రహానికి పూజలు జరిపారు. సీహెచ్‌ బాబూరావు, రాజు, భీమారావు, సూరిబాబు, రాము, రామచంద్రరావు, పరిమళ, సునీల్‌, సభ్యులు పాల్గొన్నారు.